# నేను నాటిన మొక్కలు

-ఎన్.శివనాగేశ్వరరావు

జీవితం చాలా అసంతృప్తిగా అనిపిస్తున్నది. కొద్దిరోజులుగా కాదు, కొన్ని సంవత్సరాలుగా. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఆలోచిస్తుంటాను. కారణం ఏమిటా అని? నాకు ఇష్టమైనట్లు జీవించడం లేదు. నా జీవితం నా చేతుల్లో లేదు. ఎవరో నడిపిస్తున్నారు. నేను ఒక మరబొమ్మలా...ఎవరివో ఆదేశాలను పాటిస్తూ జీవితం గడుపుతున్నాను. అదే నా అసంతృప్తికి కారణం.

నా అసంతృప్తికి కారణం తెలుసుకున్న నేను అందులోంచి బయటపడడానికి మార్గాలు అన్వేషించకపోలేదు. అయితే అమలు చేయడంలోనే విఫలమవుతున్నాను.

డిగ్రీ పూర్తి చేసాను. ప్రభుత్వోద్యోగం సంపాదించాను. అందరిలా ఎన్నో ఆశలతో జీవితంలో ప్రవేశించాను. పెళ్ళయింది. కాత్యాయని నా జీవితంలోకి ప్రవేశించింది. అక్కడినుంచే పోరాటం మొదలయింది. తను, నన్ను తనకిష్టమైన రీతిలో మలచుకోవడానికి ప్రయత్నించింది. అది నాకు నచ్చలేదు. నేను నేనులా జీవించాలన్నది నా కోరిక. అయితే అదంత తేలికయిన విషయం కాదని త్వరలోనే అర్థమై పోయింది.

కాత్యాయని అందరిలాంటిది కాదు. తను అనుకున్నది సాధించడానికి ఎంతకైనా తెగించే మనిషి.

అమ్మ నాకు ప్రాణం. తనకు నేను తప్ప మరెవరూ లేరు. అది తెలిసీ కాత్యాయని అమ్మను మాతో ఉంచుకోవడానికి ఎంతమాత్రమూ ఇష్టపడలేదు. ఎంతగానో నచ్చజెప్పాను. గొడవలు జరిగాయి. కాత్యాయని పంతం వీడలేదు. ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. పదిమందీ పది మాటలు అన్నారు. ఆ దెబ్బకు నేను కాత్యాయనికి లొంగిపోయాను. మనసు చంపుకుని అమ్మను వృద్ధాశ్రమంలో చేర్పించాను.

ప్రాణప్రదంగా ప్రేమించే అమ్మను అలా వృద్ధాశ్రమంలో వదిలిరావడం నాకు బాధ కలిగించింది. అంతకంటే మరణం నయం అనిపించింది. అమ్మ ఓదార్పు మాటలే నన్ను నిలబెట్టాయి.

కాలం సాగింది. పిల్లలు పుట్టారు. భర్త పాత్రతోపాటు తండ్రి పాత్రకూడా పోషించవలసి వచ్చింది.

పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడే కాస్త నయం. వాళ్ళ ఆటపాటలు, చిన్నారి చేష్టలు మనసుకు కాస్త సంతోషం కలిగించేవి. పిల్లలు పెద్దవారయ్యారు. నా మనసుకు ఆ కాస్త ఆనందం కూడా దూరం అయింది.

నాకంటే, కాత్యాయని చేతిలో పవర్ ఎక్కువని పిల్లలు అర్థం చేసుకున్నారు. తెలివిగా ఆ పక్షంలో చేరిపోయారు. నేను ఒంటరినైపోయాను. కాత్యాయనితోపాటు పిల్లలు కూడా నామీద జోకులు విసిరేవారు. వాళ్ళు చూస్తుండగా చిన్నగా నవ్వేవాడిని. మనసులో మాత్రం భయంకరమైన బాధ అనుభవించేవాడిని.

వృద్ధాశ్రమంలో ఉన్న అమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు నా బాధలు చెప్పుకునేవాడిని. అమ్మ నా బాధ పంచుకునేది. నాకు ఓదార్పునిచ్చేది. అదీ ఎంతో కాలం సాగలేదు. అమ్మ మరణించింది. ఆ ప్రేమబంధం తెగిపోయింది.

అందరికీ దూరంగా పారిపోవాలనిపించేది. కానీ బాధ్యతలు అడ్డుతగిలేవి. భార్యాబిడ్డలు నాకు సహకరించినా, సహకరించకపోయినా వాళ్ళ పోషణ నా బాధ్యత అనుకునేవాడిని. అనుకోవడమే కాదు...ఆచరణలో చూపేవాడిని.

నాకొచ్చే జీతంలో నాకోసం ఖర్చు పెట్టుకునేది చాలా తక్కువ. ఎక్కువ మొత్తం భార్యాబిడ్డలను ఆనందపరచడానికి, వాళ్ళు సుఖంగా ఉండేలా చూడ్డానికే ఖర్చు పెట్టేవాడిని. అయితే వాళ్ళకా స్పృహ ఉండేది కాదు. 'మమ్మల్ని చూడవలసిన బాధ్యత నీది. నీ చావు నీవు చావు' అన్నట్లు ఉండేది వాళ్ళ ధోరణి.

కాత్యాయనికి నామీద అనుమానం ఉండేది. వేరే ఆడవాళ్ళతో సంబంధాలున్నాయేమోనన్న అనుమానంతో తరుచూ ఆఫీస్‌కు వచ్చి నా గురించి వాకబు చేస్తుండేది. పదుగురిలో నాకు చులకనగా ఉండేది. కాత్యాయనితో చెప్పి చూసాను అలా రావద్దని. తను నన్ను ఖాతరు చేయలేదు.

నా మనసుకు ఒంటరితనం మరింత ఎక్కువయింది. నా ప్రపంచం చిన్నదైపోయింది. నాలో నేను కుచించుకుపోసాగాను.

నాది తప్పని తెలుసు. భార్యాబిడ్డలే లోకం కాదు. ఇంకా ప్రపంచం ఉంది. వాళ్ళు నాకు సంతోషం ఇవ్వనప్పుడు, మిగిలినవారితో కలిసిపోవాలని, నా మనసుకు సంతోషం కలిగించే పనులు చేయాలని అనుకునేవాడిని. కానీ చిత్రంగా అలా చేయలేకపోయేవాడిని.

కానీ, మనసు మాత్రం ప్రతిక్షణం దేనికోసమో ఆరాటపడుతుండేది. ఏదో చేయాలని ఉవ్విళ్ళూరేది. అయితే ఏం చేయాలో బోధపడేది కాదు.

అలా సంవత్సరాలు గడిచాయి. పిల్లలు డిగ్రీ స్థాయికి వచ్చారు. వాళ్ళ చదువులు అంతంత మాత్రంగా ఉండేవి. క్రమశిక్షణ ఉండేది కాదు. అది నాకు నచ్చేది కాదు. మంచిమాట చెబితే పెడ చెవిన పెట్టేవారు.

వాళ్ళందరికీ దూరంగా పారిపోవాలన్న ఆలోచన బలపడసాగింది. బలవంతంగా కంట్రోల్ చేసుకునేవాడిని.

కొడుక్కి ఉద్యోగం, అమ్మాయికి పెళ్ళి జరిపిస్తే నా బాధ్యతలు తీరపోతాయి. అప్పుడు అందరికీ దూరంగా ఉందామనిపించేది. అలా జరుగుతుందా? అన్న అనుమానం కూడా మనసును పట్టి పీడించేది.

కానీ అలా జరగలేదు. కాలం అంతదూరం నన్ను సాగనివ్వలేదు. జరిగిన ఒక సంఘటన నా మనసును బండబారేలా చేసింది. మనోనేత్రం తెరుచుకునేలా చేసింది.



ఆరోజు సాయంత్రం ఎప్పటిలానే ఆఫీసునుంచి బయలుదేరాను. ఇల్లు, ఆఫీసుకి దగ్గరే. అందుకే కాలినడకన వస్తున్నాను. మధ్యలో గుడి వీధి ఉంది. ఆ గుడి దగ్గర చాలామంది పోగయి కనిపించారు. ఏమయిందో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. జనాన్ని తప్పించుకుని మధ్యలోకి వెళ్ళాను.

అక్కడ ఒక పసికందు కనిపించింది. జనం మాటలను బట్టి ఎవరో తల్లి బిడ్డను కని గుడి మెట్ల దగ్గర వదిలి వెళ్ళినట్లు అర్థం అయింది. జనం రకరకాలుగా మాట్లాడుకుంటున్నారేగాని, గుక్కపట్టి ఏడుస్తున్న పసిబిడ్డను ఎవరూ దగ్గరకు తీయలేదు. ఆ దృశ్యం చూసి నా హృదయం ఆర్ద్రమయింది. పసిబిడ్డను దగ్గరకు తీయాలనిపించింది.

కానీ మనసు, ఇంటి దగ్గర పరిస్థితులను బేరీజు వేసింది. నేనా పసిబిడ్డను నాతోపాటు ఇంటికి తీసుకువెళ్తే కాత్యాయని ఆ పాపను దగ్గరకు తీయలేదు కదా, నన్ను నానా మాటలూ అంటుంది.

ఎప్పటిలానే నా హృదయం భయంతో వెనక్కు తగ్గింది. అయితే క్షణం మాత్రమే! మరలా హృదయంలో తెలియని ధైర్యం ప్రవేశించింది.

దగ్గరకు వెళ్ళి ఆ పసిబిడ్డను ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నాను. అంతవరకూ ఎంతో అశాంతి అనుభవించిన హృదయానికి మనశ్శాంతి దొరికినట్లనిపించింది. అక్కడివారితో 'ఈ బిడ్డను నేను తీసుకు వెళ్తున్నాను. ఒకవేళగాని ఈ బిడ్డ తల్లి వస్తే మా ఇంటికి పంపండి' అని చెప్పాను. అక్కడ చాలామందికి నేను తెలుసు. ఎవరూ ఏం మాట్లాడలేదు.

పసిబిడ్డతో ఇంటికి నడుస్తుంటే హృదయంలో భయంగా అనిపించ లేదు. అడుగులు తడబడలేదు. ప్రశాంతంగా గేటు తీసుకుని ఇంట్లోకి అడుగు పెట్టాను.నా చేతిలో పసిబిడ్డను కాత్యాయని చూసింది 'ఎవరు?' అని కళ్ళతోనే ప్రశ్నించింది. చెప్పాను.

"ఎవరో తల్లి కని వదిలేసి పోయింది. అందుకే తెచ్చాను. ఇకమీదట మనతో ఉంటుంది'' అని చెప్పాను.

అంతే! కాత్యాయని ఒక్క ఉదటున ఎగిరిపడింది. "దారిన పోయే దరిద్రాన్ని ఇంట్లోకి తీసుకువస్తే ఒప్పుకుంటాననుకున్నావా? అయినా నీకు, దాని తల్లికి ఏదో కనెక్షన్ ఉండి ఉంటుంది. అందుకే తెచ్చావు. ఆ దరిద్రం ఇక్కడ ఉండేటట్లయితే నేనూ, నా బిడ్డలు ఇక్కడనుంచి వెళ్లిపోతాము'' అని బెదిరించింది.

నేనేం మాట్లాడలేదు. కిచెన్‌లోకి వెళ్ళి పాలు తెచ్చి పసిపాపతో తాగించాను. ఆ తరువాత నెమ్మదిగా చెప్పాను "మీరెక్కడికీ పోనక్కరలేదు. నేనే పోతాను'' అని. నా మాటల్లోని నిశ్చయం కాత్యాయని పసి కట్టింది.

"ఎక్కడికి పోతావు?'' అని రెట్టించింది. ఇంతలో పిల్లలు వచ్చారు.

"నాన్నా! అమ్మ చెప్పినట్లు చేయి'' అని అమ్మను సమర్థించారు.

నేను వాళ్ళవంక నిర్లిప్తంగా చూసాను. అప్పటికే నా హృదయం ఒక నిర్ణయం తీసేసుకుంది.

అంతవరకూ అర్థరహితం అనిపించిన నా జీవితానికి ఏదో అర్థం దొరికినట్లు అనిపించింది. ఆ క్షణమే ఆ పసిబిడ్డను ఎత్తుకుని బయటకు తిరిగాను. "ఎక్కడికి?'' కటువుగా అడిగింది కాత్యాయని.

చిన్నగా నవ్వి "విశాల ప్రపంచంలోకి'' అని చెప్పాను.

మరలా వెనక్కి వస్తే ఒక్కడివే రావాలి. ఆ దరిద్రాన్ని మాత్రం తేవద్దు అని ఖచ్చితంగా చెప్పింది కాత్యాయని. 'అలానే' అని చెప్పి బయటకు నడిచాను.ఆ రాత్రి ఒక స్నేహితుడి ఇంట్లో బస చేసాను. నా ఒడి చేరిన అభం శుభం తెలియని పసికందు నాకు జ్ఞానబోధ చేసినట్లనిపించింది. భవిష్యత్ నిర్దేశితమయింది.


★★★

నెల గడిచింది. ఆలోపు చాలా సంఘటనలు జరిగిపోయాయి. నేను ఉద్యోగానికి రాజీనామా చేసాను. చాలామంది వారించారు. నేను ఖాతరు చేయలేదు. రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ పది లక్షలవరకూ వచ్చాయి. అందులో సగం కాత్యాయని, పిల్లల పేరున డిపాజిట్ చేసాను.మిగిలిన డబ్బుతో ఊరికి కాసింత దూరాన అర ఎకరం స్థలం కొన్నాను. అందులో ఒక కుటీరం నిర్మించాను. ఆ కుటీరానికి 'ప్రేమాలయం' అని పేరు పెట్టాను.

నేను ఉద్యోగానికి రాజీనామా చేసినందుకు లక్షలు తగలేసి అనాథ శరణాలయం పెట్టినందుకు కాత్యాయని వచ్చి రగడ చేసింది. నోటికి వచ్చినట్లు తిట్టింది. నేను నా ప్రశాంతతను కోల్పోలేదు. ఒకటే మాట చెప్పాను.

"అబ్బాయి చదువు పూర్తి చేయిస్తాను. అమ్మాయి పెళ్ళి జరిపిస్తాను. నీ భుక్తికి లోటు లేకుండా చూస్తాను. మరిక నా జోలికి రావద్దు'' అని చెప్పాను.కాత్యాయని తిట్టుకుంటూనే పోయింది. నేను చేసిన పనికి మిత్రులు కొందరు విమర్శించారు. మరికొందరు అభినందించారు. నేనేం పట్టించుకోలేదు. నేనేం చేస్తున్నానో నాకు తెలుస్తున్నది. నా మనసుకెంత సంతోషంగా ఉందో అనుభవమవుతున్నది. ఆ సంతోషానికి దూరం కాదలుచుకోలేదు. నెమ్మదిగా 'ప్రేమాలయం' ఉనికి పదిమందికీ తెలిసింది. తొలుత ఒకరిద్దరితో మొదలైన అనాథల రాక నెమ్మదిగా పెరిగింది.

ఏడాది తిరిగేసరికి ప్రేమాలయంలో మొత్తం పాతికమంది అనాథలు పోగయ్యారు. వారిలో ఏడాది పసిబిడ్డ నుంచి పదేళ్ళవరకూ పిల్లలున్నారు. వారందరికి నేనంటే ప్రాణం. 'ఫాదర్..ఫాదర్' అంటూ నా చుట్టూనే తిరగాడుతుండేవారు. 'ప్రేమాలయం' మొదలుపెట్టాక మంచి పనికి సహాయం చేసేవాళ్ళు చాలామంది ఉంటారని ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాను. చందాల రూపంలో మంచి మొత్తమే పోగయ్యేది. కొంతమంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రేమాలయంలోని పిల్లలకు చదువు చెప్పసాగారు.



## సెల్‌ఫోన్ ఎల్బో

అదేపనిగా సెల్‌ఫోన్లో మాట్లాడేవాళ్ళకి భుజం నెప్పి విపరీతంగా వచ్చి అది పెర్మనెంట్ ప్రాబ్లెమ్‌గా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి భుజం పట్టేస్తే అది శాశ్వతంగా బాధించవచ్చునట. తస్మాత్ జాగ్రత్త!

## ఆడవాళ్ళకు శలవు దినం

స్పెయిన్లోని టొరెండన్ జిమినో టౌన్లో మగవాళ్ళంతా రోజూ తమ ఫ్రెండ్స్‌తో కలిసి చేసే బీరు పార్టీలకు స్వస్తి చెప్పి ప్రతి గురువారంనాడు ఇంట్లోనే ఉండి ఇల్లు శుభ్రం చేయటం, పిల్లల్ని సమర్థించటం, వంటా వార్పూ పనులన్నీ చేయాలని- ఆరోజున ఆడవాళ్ళు తమ ఫ్రెండ్సుతో కలిసి ఔటింగ్‌కి వెళ్లి సరదాగా గడపవచ్చని ఆ ఊరి మేయరు ఆజ్ఞలు జారీ చేసారుట. అంతేకాదు, బయట మగవాళ్లెవరైనా బీరుపార్టీల్లో కనిపిస్తే రిపోర్టు చేయమని, వాళ్ళకి జరిమానాలు విధిస్తామని మహిళలకు సూచించారుట!

-తటవర్తి

ఒకప్పుడు నేను జీవితం ఎలా ఉండాలని కోరుకునేవాడినో ఇప్పుడు అలానే ఉంది. హృదయంలో ప్రేమ పదిమందికీ పంచిపెడుతున్నాను. అనాథ పిల్లల స్వచ్ఛమైన ప్రేమ ఆస్వాదిస్తున్నాను. ఇప్పుడు ప్రపంచం కొత్తగా కనిపించసాగింది.

***

మరో రెండేళ్ళు గడిచాయి. నా కొడుకు ఇంజనీరింగు చదువు పూర్తయి బొంబాయిలో ఉద్యోగం వచ్చింది. అమ్మాయికి పెళ్ళి సంబంధం కుదిరింది. కన్యాదానం చేసాను. పెళ్ళి సమయంలో కాత్యాయని ఏం గొడవ చేయలేదు. జీవితంలో దెబ్బతిన్న దానిలా మౌనముద్ర దాల్చింది.

అంతటితో నా బాధ్యతలు ముగిసాయి. నాకొచ్చే పెన్షన్ తీసుకోమని కాత్యాయనికి చెప్పాను. మౌనంగా సమ్మతించింది.

ప్రేమాలయంలో నేనే స్వయంగా ఎన్నో మొక్కలు నాటాను. అవి మెల్లిగా పెరిగి పెద్దవి కాసాగాయి. కొన్ని మొక్కలకు రంగు రంగుల పూలు పూయసాగాయి. వాటిని చూస్తుంటే ఎంతో సంతోషం కలిగేది. మొక్కలతో పాటు పిల్లలు కూడా పెద్దవారు కాసాగారు.

జీవితం సంతోషంగా గడిచిపోతున్నది అనుకున్న సమయంలో మనసులో ఒక దిగులు చేరింది. అది మెల్లగా పెద్దదై మనసుకు అశాంతిని కలుగజేయసాగింది. అదేమంటే నేను అరవయ్యో ఒడిలో పడబోతున్నాను. ఇంకెంత కాలం బ్రతుకుతానో? ఒకవేళ నాకేదైనా అయితే ఏ ప్రాపకంలేని ఈ అనాథ పిల్లల పరిస్థితి ఏమిటి? అన్నదే ఆ దిగులు. మనసుకెంతగా ధైర్యం చెప్పుకున్నా ఆ దిగులు నన్ను వదిలిపోలేదు.

మనసులో చేరిన దిగులు నా ఉత్సాహాన్ని కొంతవరకూ దెబ్బ తీసింది. మునుపటిలా సంతోషంగా ఉండలేకపోతున్నాను.

నా ఫీలింగ్స్ పిల్లలు తెలుసుకోలేక పోయారుగాని నేను నలతగా ఉన్నట్లు అర్థం చేసుకుని ఆందోళన వెలిబుచ్చారు. వారి చిన్నారి చేతులతో నాకు జ్వరం వచ్చిందేమోనని ఒళ్లంతా తడుముతుంటే నాకు కళ్ళు చెమర్చాయి. "నాకేం కాలేదు. బాగానే ఉన్నాను'' అని నచ్చచెప్పాను. అయినా వాళ్ళ బాధ తీరలేదు.వాళ్ళందరూ గుంపులు, గుంపులుగా చేరి నా గురించి మాట్లాడుకుంటున్న దృశ్యం నాకు ముచ్చటగొలిపింది.

పిల్లలందరికీ ఒక లీడర్ ఉన్నాడు. వాడి పేరు గోవిందు. వాడి వయసు పన్నెండేళ్లు. తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో చనిపోతే బంధువులు ఎవరూ చేరదీయక ప్రేమాలయం చేరాడు. పిల్లలందరూ ఏం చెప్పారో...గోవిందు నా దగ్గరకు వచ్చాడు. "ఏం గోవిందూ?'' అని అడిగాను.

"ఫాదర్! మీకోమాట చెప్పాలి'' అన్నాడు గోవిందు.

"చెప్పు!'' అన్నాను చిరునవ్వుతో.

"మీరీ మధ్య నలతగా ఉంటున్నారు. మునుపటి ఉత్సాహం, సంతోషం కనిపించడం లేదు. అది మా అందరికీ బాధగా ఉంది. అందుకని మీరు కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోండి. ఇది పిల్లలందరి కోరిక'' చెప్పాడు గోవిందు.

వాళ్ళ అభ్యర్థన నా హృదయాన్ని తాకింది. సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ "మరి నేను విశ్రాంతి తీసుకుంటే ప్రేమాలయాన్ని ఎవరు చూసుకుంటారు!'' అని అడిగాను.


"నేను చూసుకుంటాను ఫాదర్! పిల్లలందరినీ మీరెలా ప్రేమగా చూస్తారో నేనూ అలానే చూస్తాను. ఎవరికి ఏ ఇబ్బందీ రానివ్వను. చంటి పిల్లలకు తిండి తినిపిస్తాను. పెద్ద పిల్లలకు చదువు చెప్తాను. గాడ్ ప్రామీస్! నన్ను నమ్మండి'' అన్నాడు.

ఒక బలమైన పవనం నన్ను తాకినట్లయింది. మనసంతా సంతోషంతో నిండిపోయింది. ఇన్ని రోజులూ నేను నాటిన మొక్కలకు నేను లేకపోతే ఎవరు నీరు పోస్తారా? అని బాధపడ్డానే కాని, ఆ మొక్కలు పెద్దవవుతున్నాయని ఎందరికో నీడనివ్వబోతున్నాయన్న సత్యాన్ని విస్మరించాను. గోవిందు మాటలు నాకా సత్యాన్ని బోధపరిచాయి.

గోవిందుని దగ్గరకు తీసుకుని ప్రేమగా బుగ్గ ముద్దాడాను. "మీరందరూ ఉండగా నాకే దిగులూ లేదు. ఇక మీదట లోకంలోని సంతోషమంతా నా స్వంతం'' అన్నాను.గోవిందుకి ఏం అర్థమయిందో "థేంక్యూ ఫాదర్!'' అని నా చేతిని ముద్దాడాడు. గోవిందు వెళ్ళి పిల్లలకు ఏం చెప్పాడో, అందరూ ఉత్సాహంగా గంతులు వేయసాగారు.

పిల్లలు ఎదుగుతున్న మహావృక్షాల్లా కనిపించారు నాకు. నా దృష్టి తోటలోని పూల మీద పడింది. అవి చిరుగాలికి కదలాడుతూ నన్ను పలకరిస్తున్నట్లనిపించింది. నేను నాటిన మొక్కలనుంచి వస్తున్న పరిమళం నన్ను దివ్యలోకాలకు తీసుకు వెళ్ళింది.

★



## నో ప్రాబ్లమ్

షాహిద్ కపూర్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన కరీనా కపూర్ అతనికి దూరమయ్యాక సైఫ్ అలీఖాన్‌కి దగ్గరైంది. షాహిద్-కరీనా కలిసి ప్రస్తుతం ఏ సినిమాలోనూ నటించడంలేదు. కనీసం ఎదురుపడినప్పుడు విష్ చేస్కుంటున్నారా? అని ఓ అభిమాని అడిగాడట కరీనాని. 'నేను షాహిద్‌తో ఫ్రెండ్షిప్‌తో వున్నప్పుడు గడిపిన సమయం నిజంగా మధురమైనది. అయితే మేమిద్దరం అస్సలు టచ్‌లో లేను. ఎప్పుడైనా అతను ఎదురుపడితే పలకరించడానికి నేనేమీ ఇబ్బంది ఫీల్ కాను' అని తెలివిగా అంటోంది కరీనా.

